క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 28, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 33, పచ్చకాకర 23, పందిరి బీర 23, క్యాబేజీ 11, క్యారెట్ 35, దొండ 17, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 45, గోకరకాయ 28, కీర 35, దోసకాయ 13, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 28, ఆలుగడ్డ 26, చామగడ్డ 35, మొరంగడ్డ 40, కందగడ్డ 40, సొరకాయ 11, పొట్లకాయ 11, అరటికాయ 10, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నేడు బస్తీ దవాఖానాలు ప్రారంభం

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని పలు బస్తీల్లో నేడు (మంగళవారం) బస్తీ దవాఖానాలు ప్రారంభం కానున్నట్లు లాస్య నందిత పేర్కొన్నారు. ఐదవ వార్డు సంజీవయ్య నగర్, ఏడో వార్డు తిరుమలగిరి, మూడో వార్డు అన్నానగర్, రెండో వార్డు రసూల్‌పురా సీబీఎస్ నగర్‌లోని బస్తీ దవాఖానాలను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, మన్నె క్రిశాంక్, గజ్జెల నాగేష్, మర్రి రాజశేఖర్ రెడ్డి హాజరై ప్రారంభిస్తారన్నారు.

చలాన్లు విధించి ఆటోలను రిలీజ్ చేయాలి


బెజ్జాల కృష్ణమూర్తి


లాలాపేట: ట్రాఫిక్ పోలీసులు వివిధ కారణాలతో సీజ్ చేసిన ప్యాసింజర్ ఆటోలకు చలాన్లు విధించి వెంటనే రిలీజ్ చేయాలని ఏఐటీయూసీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ బెజ్జాల కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన తార్నాకలో పలువురి ఆటో డ్రైవర్లతో కలిసి మాట్లాడారు. గతంలో నోపార్కింగ్, పెండింగ్ చలాన్లు, ఫిట్‌నెస్, స్పెషల్ డ్రైవ్‌లలో సీజ్ చేసిన పలు ఆటోలను వదిలేయాలని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు వెళ్తే ఆర్టీఏ కార్యాలయం నుంచి రిలీజ్ ఆర్డర్ తీసుకురావాలని చెప్పడం సరికాదన్నారు. నగరంలో అసలే ఆటోలకు గిరాకి లేక ఆటో డ్రైవర్ల బతుకు ఇబ్బందిగా మారిందని ఇలాంటి లాంటి తరుణంలో ఇటు ట్రాఫిక్ పోలీసులు, అటు ఆర్టీఏ అధికారులు వేధించడం సరికాదన్నారు. తక్షణమే ఆటోలను రిలీజ్ చేయాలని లేదంటే ఆయా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల వద్ద ధర్నా చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఉదయనిధి స్టాలిన్ క్షమాపణ చెప్పాలి


మాట్లాడుతున్న శశిధర్‌రెడ్డి

పద్మారావునగర్: సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేసి హిందువుల మనోభావాలను కించపర్చిన తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, కార్పొరేటర్ కొంతం దీపికా డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ బాటా చౌరస్తాలో సోమవారం నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. దేశ ప్రజలు అనాదిగా అనుసరిస్తున్న ధర్మాన్ని కించపర్చేలా ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలు ఉన్నాయని వెంటనే మంత్రి పదవి నుంచి తప్పించాలన్నారు. ధర్నాలో శ్యాంసుందర్ గౌడ్, కార్పొరేటర్లు చీర సుచిత్రశ్రీకాంత్, సరళ, నాయకులు పెద్ది రవీందర్, వెంకటరాజ్, గుంటి సత్యనారాయణ, పరశురామ్, రాజు, దయానంద్, శంకర్, సత్యనారాయణ, రజని, సుస్మిత పాల్గొన్నారు.

మజ్దూర్ యూనియన్‌లో చేరిక



సికింద్రాబాద్: దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఎలక్ట్రికల్ బ్రాంచ్ చైర్మన్ ప్రకాష్‌రావు సోమవారం మజ్దూర్ యూనియన్‌లో చేరగా ప్రధాన కార్యదర్శి సీహెచ్. శంకర్‌రావు కండువా కప్పి ఆహ్వానించారు. ఆయనతో పాటు పవన్‌కుమార్, నాగరాజు, బాలాజీ, స్వేత బిందు, భాస్కర్ కూడా చేరారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం మజ్దూర్ యూనియన్ చేపడుతున్న పోరాటాలకు ఆకర్షితులై యూనియన్‌లో చేరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్, భారటే, చిలుకు స్వామి, గోపాల్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 18 నుంచి జరగనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని పలు విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం ఎంఎస్ఎఫ్ అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ అధ్యక్షతన ఓయూలో జరిగిన రౌండ్‌టేబుల్ కార్యక్రమంలో ఓయూ మాజీ ప్రొ.గాలి వినోద్‌కుమార్‌తో పాటు ఎంఎస్ఎఫ్ అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శి పల్లెర్ల సుధాకర్ పాల్గొని ప్రసంగించారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్


స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: బేగంపేట నాలాను ఆనుకుని ఉన్న బ్రాహ్మణవాడిలో సీవరేజ్ లైన్, రోడ్ల నిర్మాణాన్ని ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశించారు. వివిధ విభాగాల అధికారులతో కలిసి సోమవారం ఆయన బ్రాహ్మణవాడిలో పర్యటించి అక్కడ జరుగుతున్న బేగంపేట నాలా అభివృద్ధి పనులు, బస్తీలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. నాలాలో పూడిక తీసిన మట్టిని తొలగించి అక్కడే ఉంచారని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో బేగంపేట నాలాకు వచ్చే వరదతో పరిసర కాలనీల్లోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడేవారని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆలోచనల మేరకు సమగ్ర నాలా అభివృద్ధి కార్యక్రమం కింద రూ.45 కోట్ల వ్యయంతో నాలా అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. కాలనీల్లోకి వరదనీరు రాకుండా నివారించేందుకు రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, నాలాలో పూడిక తొలగించడం జరుగుతుందన్నారు. బ్రాహ్మణవాడిలో సీవరేజీ, మంచినీటి లైన్ల ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు కూడా చేపట్టడం జరిగిందని ఎస్ఎన్‌డీపీ కార్యక్రమంతో ఈ సంవత్సరం ముంపు సమస్య ప్రభావం చాలా వరకు పరిష్కరించబడిందన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ ప్రాంత ముంపు సమస్యను పరిష్కరించాలని గత పాలకులు, ఈ ప్రాంతం నుంచి ప్రాతినిథ్యం వహించిన వారు కానీ ఆలోచన చేయలేదని విమర్శించారు. మంత్రి వెంట కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి, జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ శంకర్, ఈఈ సుదర్శన్, ఎస్ఎన్‌డీపీ ఎస్ఈ భాస్కర్‌రెడ్డి, వాటర్‌వర్క్స్ సీజీఎం ప్రభు, ఎలక్ట్రిసిటీ డీఈ సుధీర్, స్ట్రీట్‌లైట్ ఏఈ భరత్, నాయకులు నరేందర్, శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, అఖిల్, ఆరీఫ్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి..

బన్సీలాల్‌పేట్: ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని మంత్రి తలసాని సూచించారు. బన్సీలాల్ పేట్ డివిజన్‌లో రూ.1. 96 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు ప్రజాభివృద్ధి పనులను సోమవారం ఆయన కార్పొరేటర్ హేమలతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాదయాత్రల సమయంలో ప్రజలు సూచించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. పలు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, విద్యుత్, పార్కు ఆధునికీకరణ, పారిశుద్ధ్యం వంటి సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తున్నారన్నారు. ప్రజలు సూచించిన సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ కమిషనర్ శంకర్, ఈఈ సుదర్శన్, జలమండలి సీజీఎం ప్రభు, డీజీఎం బ్రహ్మారెడ్డి, విద్యుత్తు డీఈ శ్రీధర్, ఏడీఈ మహేష్, నాయకులు పవన్‌కుమార్ గౌడ్, వెంకటేషన్, ఏసూరి మహేష్, వెంకటరమణ, నాగలక్ష్మీ, గజ్జెల శ్రీనివాస్, వెంకట్ ముదిరాజ్, కుమార్ యాదవ్, లక్ష్మీపతి, శ్రీకాంత్‌రెడ్డి, జనార్దన్, రాజేందర్ పాల్గొన్నారు.

అధికారులపై మంత్రి గరం

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలని మంత్రి సూచించారు. సోమవారం బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో స్థానిక ప్రజలు పలువురు మంత్రి తలసానిని సమీపించి పారిశుద్ధ్యం, దోమల బెడద, డ్రైనేజీ వంటి సమస్యలపై ఏకరువు పెట్టారు. దీంతో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జలమండలి, జీహెచ్‌ఎంసీ, ఎంటమాలజీ, పారిశుధ్య విభాగాలకు చెందిన అధికారులను పిలిచి ప్రజా సమస్యలు పరిష్కరించకుండా ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తమ పనితీరు, పద్ధతిని మార్చుకోవాలని హెచ్చరించారు.

సనాతన ధర్మరక్షణ అందరి బాధ్యత


ధర్నాలో పాల్గొన్న బీజేపీ నాయకులు

చిలకలగూడ: సనాతన ధర్మాన్ని రక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీజేపీ నాయకులు అన్నారు. సనాతన ధర్మాన్ని నిర్మూలిస్తామన్న తమిళనాడు మంత్రి ఉదయనిధి చేసిన వ్యాఖ్యలను నిరసనగా చిలకలగూడ గాంధీ చౌక్ వద్ద సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కండాడి నాగేశ్వరరెడ్డి నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన ఉదయనిధి స్టాలిన్‌ను మంత్రి పదవి నుంచి తప్పించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మంపై ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్న ఇండియా కూటమి, ఓ వర్గం ప్రజల మెప్పు పొందేందుకు కృషి చేస్తున్న డీఎంకే ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో బండా కార్తీకరెడ్డి, రవిప్రసాద్‌గౌడ్, సతీష్, ఆదం విజయ్‌కుమార్, మేకల సారంగపాణి, రాచమల్ల కృష్ణమూర్తి, ప్రభుగుప్తా, శారద, వేణు, శ్రీధర్, రాముపర్మ, హనుమంతు, గణేష్ పాల్గొన్నారు.

అడ్డగుట్టలో క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం


అవగాహన కల్పిస్తున్న ఎస్పీహెచ్‌ఓ రాజశ్రీ

అడ్డగుట్ట: క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీహెచ్‌ఓ రాజశ్రీ సూచించారు. సోమవారం యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ, ఎంఎన్‌జే హాస్పిటల్ ఆధ్వర్యంలో అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌లో రాజశ్రీ పాల్గొని మాట్లాడారు. క్యాన్సర్ సంబంధిత లక్షణాలు ఉన్న వాళ్లు తప్పనిసరిగా ఆరు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ముఖ్యంగా 30 సంవత్సరాలు పైబడిన మహిళలు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ వ్యాధుల నుంచి బయటపడొచ్చని సూచించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి సాయి శంకర్, డాక్టర్ సౌజన్య పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం

కంటోన్మెంట్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి (జేఎమ్మార్) అన్నారు. ఝార్ఖండ్ అమెచ్యూర్ స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాంచీలో నిర్వహించిన నేషనల్ కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్-2023లో గోల్డ్‌మెడల్ సాధించిన కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన జైదీప్‌ను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. జైదీప్‌కు ప్రభుత్వం తరఫున సహకారం అందేలా చూస్తానని క్రీడాకారులకు పుట్టినిల్లు వంటి కంటోన్మెంట్ నుంచి మరింత మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. రామకృష్ణ, రవీందర్, సురేశ్ యాదవ్ పాల్గొన్నారు.


జైదీప్‌ను సత్కరిస్తున్న జక్కుల మహేశ్వర్ రెడ్డి

బహిరంగసభను విజయవంతం చేయాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నోముల ప్రకాశరావు

చిలకలగూడ : తుక్కుగూడ విజయభేరి బహిరంగసభను విజయవంతం చేయాలని సికింద్రాబాద్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నోముల ప్రకాశరావు పిలుపునిచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సీతాఫల్‌మండి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులను తుక్కుగూడ బహిరంగసభకు తరలించేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించామన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అందించే ఐదు గ్యారంటీ కార్డు పథకాలను విజయభేరి సభలో ప్రకటిస్తారన్నారు. అనంతరం బీజేపీ, బీఆర్ఎస్ తోడుదొంగలని వారిని తరిమికొట్టాలనే నినాదంతో రూపొందించిన కరప్రతాలను ఆవిష్కరించారు. మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు ర్యాలీలు, పాదయాత్రలు చేపట్టనున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా ఈనెల 12వ తేదీ మంగళవారం తార్నాక డివిజన్ మాణికేశ్వరీనగర్, రవీంద్రనగర్, పార్థివాడ, మసీదురోడ్డు తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందించి విజయభేరి సభకు తరలిరావాలని కోరుతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జగదీశ్వరరావు, సురేష్‌లాల్, ఎమ్మార్ శ్రీనివాస్, వహిదుద్దీన్, శ్రీశైలం, కరీమ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ అవకాశాలకు వర్క్‌షాప్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేరీర్ ఉద్యోగ అవకాశాల కోసం ఈ నెల 13న వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఉత్తీర్ణులైన గ్రాడ్యుయేట్లు, వర్కింగ్ ప్రొఫెషనల్స్ హాజరుకావాలని మరింత సమాచారం కోసం 93218 25558 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం


వడ్డెరబస్తీలో పర్యటిస్తున్న ప్రసన్నలక్ష్మి


అడ్డగుట్ట: మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. సోమవారం తుకారాంగేట్ వడ్డెర బస్తీలో ఆమె అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు, డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రోడ్డు, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, వెంటనే ప్రతిపాదనలను సిద్ధం చేయాలని జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ఏఈ వేణు, బీఆర్ఎస్ నేతలు లింగాని శ్రీనివాస్, నక్క మధు, ఎల్లయ్య, ఇస్మాయిల్, అంజయ్య, శివ శంకర్, శ్రీరామ్, వడ్లూరి రవి, మహేష్ ఉన్నారు.

క్రైం కార్నర్..

రైలు ప్రమాదంలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

అడ్డగుట్ట: రైలు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తుకారాంగేట్‌కు చెందిన సుందర్ రాజ్(40) కారు డ్రైవర్. ఈ నెల 7న లాలాగూడ రైల్వే స్టేషన్ సమీపంలోని పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడటంతో గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

అనుమానాస్పద స్థితిలో యువతి అదృశ్యం


సునీత

బంజారాహిల్స్: అనుమానాస్పద స్థితిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... గుట్టలబేగంపేట నవభారత్ నగర్‌లో నివసించే సునీత(24) జూబ్లీహిల్స్‌లోని సంగీతాగుప్తా అనే మహిళ ఇంట్లో కొంత కాలంగా పని చేస్తున్నది. ఈ నెల 10వ తేదీన ఎప్పటిలాగే డ్యూటీకి వెళ్లి సాయంత్రానికి తిరిగి రాకపోవడంతో ఆమె తమ్ముడు రవి పని చేస్తున్న ప్రాంతానికి వెళ్లి ఆరాతీయగా మధ్యాహ్నం ఓ బైక్‌పైన వెళ్లడం చూశానని వాచ్‌మెన్ చెప్పాడు. సోదరికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో అన్ని ప్రాంతాలు గాలించినా ఫలితం లేకపోవడంతో తన సోదరి కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదుచేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని యువతి కోసం గాలింపు చేపట్టారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 040 2785 2447లో సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



లాలాపేట: వాంబే, జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహాల మరమ్మతులకు రూ. 100 కోట్లు కేటాయిస్తున్నట్లు మంత్రి కేటీఆర్ ప్రకటించడంపై చంద్రబాబునగర్‌లోని వాంబే, జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహసముదాయాల వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డిని కలిసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ..శిథిలావస్థకు చేరిన గృహాలకు మహర్దశ రానుందన్నారు. ఇటీవల లాలాపేటలోని పాతకాలం నాటి వాంబే గృహాల్లో పెచ్చులూడగా పలువురు గాయపడ్డారని అలాంటి గృహాలకు మరమ్మతులు చేయడం ద్వారా ఆ వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి


మాట్లాడుతున్న ఏసీపీ రవీందర్

బన్సీలాల్‌పేట్: గణేష్ నవరాత్రోత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని గాంధీనగర్ డివిజన్ ఏసీపీ రవికుమార్ సూచించారు. న్యూబోయిగూడ ముదిరాజ్ సంఘంలో సోమవారం ఏర్పాటు చేసిన గణేష్ మండప నిర్వాహకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా గణేష్ వేడుకలను నిర్వహించాలన్నారు. ముందస్తు పోలీసులతో పాటు విద్యుత్ అనుమతులను తీసుకోవాలన్నారు. ఉత్సవాల సందర్భగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు, శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మండపాల వద్ద అపరిచిత వ్యక్తులు, బ్యాగులు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రహదారులు, ఇరుకైన బస్తీల్లో రాకపోకలు, ప్రజలకు ఇబ్బంది కలిగేలా మండపాలను ఏర్పాటు చేయరాదన్నారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు ఎస్. రవి, శ్రీనివాస్ రెడ్డి, డెబోరాలతో పాటు ఎస్.ఐలు శ్రీనివాస్ రెడ్డి, జీవన్‌రెడ్డి, గణేష్ మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

పోలీసులకు సహకరించాలి

సనత్‌నగర్: పండుగలను ప్రశాంతంగా జరిగేలా ఉత్సవ కమిటీల ప్రతినిధులు పోలీసులకు సహకరించాలని మహంకాళి ఏసీపీ రవీందర్ అన్నారు. వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పర్వదిన వేడుకల నేపథ్యంలో మహంకాళి డివిజన్ పరిధిలోని ఆయా ఉత్సవాల కమిటీ ప్రతినిధులతో సోమవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. అనుమానిత వ్యక్తుల పట్ల ఉత్సవ కమిటీ ప్రతినిధులు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలజడి సృష్టించాలనుకునే అసాంఘిక శక్తుల పట్ల నిరంతర నిఘా ఉంటుందన్నారు. అవసరమైన చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని నిబంధనల మేరకే ఉత్సవ కమిటీ నిర్వాహకులు నడుచుకోవాలన్నారు. మండపాల వద్ద రాత్రివేళల్లో కూడా కాపలాదారులను నియమించుకోవాలన్నారు.


మాట్లాడుతున్న ఏసీపీ రవికుమార్

రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు


పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

బౌద్ధనగర్: నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. సోమవారం ఆయన బౌద్ధనగర్ డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. కార్పొరేటర్ కంది శైలజతో కలిసి రూ. 4 కోట్ల వ్యయంతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి తాము పాటు పడుతున్నామని, సికింద్రాబాద్‌ను అభివృద్ధి పథంలో నడుపుతున్నామన్నారు. డబుల్ బెడ్రూమ్‌ల కేటాయింపును పారదర్శకంగా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు కిషోర్ గౌడ్, కంది నారాయణ, అందజేయులుగౌడ్, పాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకాలు..

సికింద్రాబాద్: ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు చేర్చిన ఘనత సీఎం కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన బీసీ కులాల లబ్ధిదారులకు సోమవారం చెక్కుల పంపిణీ చేసి మాట్లాడారు. వెనుకబడిన కులాలకు ప్రయోజనం కలిగించే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. బీసీ కులాలకు చెందిన వారికి ఆర్థికంగా ఉపకరించి, స్వయం ఉపాధిని కల్పించేందుకు వీలుగా రూ. లక్ష మేరకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కిషోర్, రాంచందర్, పాకసాయి పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలపై మక్కువ


విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి గణపతుల ప్రతిమలు


రంగులు వేస్తున్న దృశ్యం

రసూల్‌పురా: వినాయక చవితి ఉత్సవాల్లో కాలుష్యానికి కారణమవుతూ ప్రజలకు ఇబ్బందుల కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, వివిధ రసాయనాలతో తయారయ్యే వినాయక విగ్రహాలు కాకుండా మట్టి ప్రతిమల వైపు ప్రజలు మక్కువ చూపుతున్నారు. ప్రతియేడు కాలుష్య రహిత మట్టి గణపతులు ప్రతిష్ఠించాలని ప్రభుత్వం, పలు స్వచ్ఛంద సంస్థలు పర్యావరణవేత్తలు ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో మట్టి ప్రతిమలను ప్రతిష్ఠించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నెల 18న వినాయక చవితి పండుగ ఉండడంతో మండప నిర్వాహకుల అభిరుచికి తగ్గట్టు ప్రతిమలు అమ్మకాలు చేసే వ్యాపారస్తులు కలకత్తా, షోలాపూర్ ఇతర ప్రాంతాల నుంచి మట్టి గణపతులను నగరానికి తీసుకువచ్చి అమ్ముతున్నారు. బోయిన్‌పల్లి చెక్‌పోస్టు నుంచి సుచిత్ర వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన మట్టి గణపతుల ప్రతిమలు లభ్యమవుతున్నాయి. ఒక్క అడుగు నుంచి ఆరు అడుగుల ఎత్తు వరకు వెయ్యి రూపాయల నుంచి ఆరు వేల రూపాయల వరకు వివిధ ఆకృతుల్లో లభిస్తున్నాయి. మట్టి గణపతులకు సైతం ఆకర్షణీయంగా రంగులు వేసి అమ్మకాలు చేస్తున్నారు. గత ఐదేళ్లుగా మట్టి గణపతుల ప్రతిమల వైపు మొగ్గు చూపుతున్నారు. కలకత్తాలో బంకమట్టితో ఎలాంటి రసాయనాలు ఉపయోగించని సహజ సిద్ధమైన రంగులతో రూపొందించిన పలు రూపాలు, వివిధ సైజుల్లో అందుబాటు ధరల్లో అమ్ముతున్నామని విక్రేత శ్రీనివాస్ పేర్కొన్నారు.

17న తెలంగాణ రైతు సంక్షేమ సమితి సదస్సు

పంజగుట్ట: ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఉచితంగా ఎరువులు ఇస్తామని సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు అతీగతీ లేదని తెలంగాణ రైతు సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 17వ తేదీ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతు సంక్షేమ సమితి నాలుగవ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సదస్సు కరపత్రం, పోస్టర్‌ను సమితి అధ్యక్షులు ఓర్సు ఇంద్రసేన, కోశాధికారి సూర్యకిరణ్, సదస్సు నిర్వహణ కమిటీ అధ్యక్షులు ఎం.రఘునాథ్, నైనాల గోవర్ధన్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మొన్నటివరకు 200 పలికిన టమోటా ప్రస్తుతం ధరలు లేక పారబోయాల్సిన పరిస్థితి వస్తుందని దీనికంతటికీ కారణం రైతుల వద్ద కొనుగోలు చేసే మధ్యవర్తులే అని అన్నారు. పెరిగిన ఎరువులు, విత్తనాల రేటు ప్రకారం ప్రభుత్వం ఇచ్చే రైతుబంధు సరిపోవడంలేదని తిరిగి రైతులు చేతినుండి పెట్టుకోవాల్సి వస్తుందన్నారు. కౌలు రైతులు అనేక కష్టాలకు గురౌతున్నారని కౌలురైతులు, వాస్తవంగా సాగు చేసేవారికే రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. సమితి ఆధ్వర్యంలో ఇప్పటివరకు ఆత్మహత్యలు చేసుకున్న 200 రైతు కుటుంబాలకు పదివేల చొప్పున ఆర్థికసాయం చేశామన్నారు. 17వ తేదీన జరిగే కార్యక్రమంలో రైతుల కష్టాలు తెలుసుకుని మేనిఫెస్టో ప్రకటిస్తామన్నారు. సమావేశంలో మన్నారం నాగరాజు, సాగరాబేగం, నర్సింగ్‌రావు, లక్ష్మీనారాయణ, స్నేహారెడ్డి, లింగయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.